క్లుప్తంగా

మంత్రిని కలిసిన నాయకులు



రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన పెద్దేముల్ నాయకులు

పెద్దేముల్: కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లి, విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శోభారాణి తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రికి శుభాకాంక్షలు



సబితారెడ్డితో నాయకులు

నవాబుపేట: బీఆర్‌ఎస్ మండల కమిటీ సభ్యులు సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా పనిచేయాలని సూచించారు. కష్టపడిన వారికే రాబోవు రోజుల్లో భవిష్యత్ ఉంటుందన్నారు. సబితారెడ్డిని కలిసిన వారిలో గౌరవ అధ్యక్షుడు పట్లోల్ల భారత్ రెడ్డి, ముఖ్య సలహాదారులు విజయ్, సయ్యద్ గౌస్, నూతన అధ్యక్షుడు, దయాకర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు శాంతి కుమార్, పురుషోత్తం ప్రధాన కార్యదర్శి, పోలీస్ మహేశ్‌రెడ్డి, కార్యదర్శులు అమరేందర్ రెడ్డి, మాణిక్ రెడ్డి, కోశాధికారి ఎం.నరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ పూజలో పాల్గొన్న సుధాకర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం కొత్తగంజ్‌లోని అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర ఆలయ ఆరవ వార్షికోత్సవ సోమవారం వైభంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభించారు. అనంతరం అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త సుధాకర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి మహామంగళహారతి ఇచ్చిన తర్వాత తీర్థప్రసాదాలు అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రబృందం

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామానికి చెందిన ఎర్రం యాదగిరి(32) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన స్నేహితులు వారి కుటుంబానికి అండగా ఉండాలని 2007-08లో కుల్కచర్ల జెడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి పూర్తి చేసుకున్న వారు తక్షణ సాయంగా రూ.16వేలు అందజేశారు. దీంతో గ్రామస్తులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, సాయికృష్ణ, మల్లేశ్, శ్రీను, దస్తయ్య, తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



అంతారంలో ఊరేగింపు

కుల్కచర్ల: మండల పరిధిలోని అంతారం గ్రామంలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ ఉత్సవాల్లో బొడ్రాయి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీ సమస్యల ఒడి!



బాలంపేటలో నిరుపయోగంగా ఉన్న భవనం

- మెజార్టీ సెంటర్లలో వసతులు కరువు
- పలు చోట్ల ఖాళీ పోస్టులతో సతమతం
- పౌష్టికాహార పంపిణీలోనూ నిర్లక్ష్యం
- చిన్నారులకు అందని విద్యాబుద్ధులు



గుండేపల్లిలో ఓ పాఠశాలలో కొనసాగిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. చిన్నారులు, గర్భిణులు బాలింతలకు పౌష్టికాహారంతో పాటు చిన్నారులకు బాల్యం నుంచే ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న ఈసెంటర్లలో ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. మరోవైపు చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు అవసరమైన టీచర్లు లేకపోవడంతో గందరగోళం నెలకొంది. సరైన పోషకాహారం అందక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు చాలా సెంటర్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. దౌల్తాబాద్ మండలంలో మొత్తం మినీ అంగన్‌వాడీలతో కలిపి 68 కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 263 మంది గర్భిణులు, 158 బాలింతలు సేవలు పొందుతున్నారు. ఇందులో సుమారు 35 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేంద్రాల్లో పిల్లలు ఆడుకోవడానికి సరైన ఆటస్థలం, ఆట వస్తువులు లేవు. బాలంపేటలో లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది.

సిబ్బంది కొరత..

ఇదిలా ఉండగా పిల్లలకు జరుగుతున్న విద్యాబోధన బాలింతలు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం పంపిణీపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఆదిశగా చర్యలేవీ తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు కేటాయించిన కేంద్రాల్లో నెలకొన్న సిబ్బంది కొరత కారణంగా తనిఖీలు జరగడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదని తెలుస్తోంది. కేంద్రాల్లో సమయపాలన పాటించడంలేదని, తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అంగన్‌వాడీ టీచర్లకు కేంద్రాల నిర్వహణతో పాటు ఇతర బాధ్యతలు అప్పగిస్తుండటంతో ఇబ్బందులు నెలకొంటున్నాయి. వీరు ఎటూ న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలూ లేకపోలేదు. మండలంలోని బంగ్లాతండా, తిమ్మాయిపల్లి, అంత్వార్, దాసరిగూడెం, దేవర్‌ఫసల్‌వాద్, హన్మానాయక్‌తండా, భాగ్యతండా, ఆయాలు తిమ్మారెడ్డి పల్లి, అల్లాపూర్, వాల్కితండా, బంగ్లాతండా, గోకఫసల్‌వాద్, తిమ్మాయిపల్లి, ఊరగుంటతండా, దౌల్తాబాద్, సంగాయిపల్లి, ఇందాపూర్, గుండేపల్లి, నీటూరు, కుదురుమళ్ళ, ఊరగుంట, గుముడాల, మాటూరు, కిష్టానాయక్‌తండా, తిర్మాలాపూర్, బాలంపేట గ్రామాల్లోని కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తక్షణమే వీటిపి భర్తీ చేసి కేంద్రాలు సక్రమంగా నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

> **పర్యవేక్షిస్తున్నాం..**
>
> అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టి పర్యవేక్షిస్తున్నాం, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. టీచర్లు, ఆయాల పోస్టుల ఖాళీలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. కొన్ని గ్రామాల్లో భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయం కూడా అధికారులకు తెలియజేశాం.
>
> – మంజుల, సూపర్‌వైజర్



దోమ ఎస్‌బీఐలో జనం రద్దీ

బ్యాంకులో సిబ్బంది కొరత

- పనులు కదలక
- ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు

దోమ: మండల పరిధిలో ఎస్‌బీఐ బ్యాంకులో సిబ్బంది కొరతతో ఖాతాదారులు విసుగెత్తుతున్నారు. ఒకటే శాఖ.. వేల మంది ఖాతాదారులున్నారు. నిత్యం వందలాది మంది బ్యాంకు పనుల నిమిత్తం వచ్చి పనులు సకాలంలో జరగకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవైసీ, క్రాప్‌లలోన్ రెన్యూవల్, బిజినెస్ ఖాతాదారులతో బ్యాంకులో నిత్యం రద్దీగా ఉంటుంది. సరిపడా సిబ్బంది లేక పనులు ఆలస్యమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసతఉన్నారు. ఉదయం వస్తే సాయంత్రం వరకు నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఖాతాదారుల ఇబ్బందులు పరిష్కరించాలని కోరుతున్నారు.

మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని వినతి

నందిగామ: మండల పరిధిలోని బుగ్గోనిగూడ గ్రామ పంచాయతీలో మహిళా సమాఖ్య భవనం నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మహిళా సంఘం సభ్యులు, నాయకులు కోరారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు వారు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 10 మహిళా సంఘాల్లో 108 మంది సభ్యులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో భవనంలేని కారణంగా వారు సమావేశాలు, ఇతర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు శ్రావన్, నర్సింహ, సాలయ్య, శ్రీనివాస్, ప్రభాకర్, మహిళా సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వైభవంగా దేవీ శోభాయాత్ర



ధారూరు: కేరెళ్లిలో దుర్గామాత శోభాయాత్రను ప్రారంభిస్తున్న భక్తులు

- నిమజ్జనానికి తరలిన దుర్గమ్మతల్లి
- పల్లెల్లో పండుగ వాతావరణం

ధారూరు: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ధారూరు మండలం కేరెళ్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాత నిమజ్జన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ప్రారంభమైన శోభాయాత్ర సోమవారం ఉదయం వరకూ కొనసాగింది. భక్తుల కోలాటాలు, నృత్యాలతో సందడి పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం అమ్మవారి ప్రతిమను ఎబ్బనూరు చెరువులో నిమజ్జనం చేశారు.

హస్నాబాద్‌లో..

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో దుర్గామాత నిమజ్జన వేడుకలు సోమవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు చేపట్టారు. యువకుల తీన్మార్ స్టెప్పుల నడుమ ఊరేగింపు కొనసాగింది. అంతరం అమ్మవారిని గ్రామంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.



దుద్యాల్: అమ్మవారి ఊరేగింపు

కొలువులు సాధించిన వారికి సన్మానం

కొడంగల్ రూరల్: ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన పలువురిని అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గాంధీనగర్‌కు చెందిన పి.శ్రీనివాస్, చిన్న నందిగామకు చెందిన భీమరాజు, టేకుల్‌కోడ్‌కు చెందిన కె.అరుణ, దౌల్తాబాద్ మండలం నందారం గ్రామానికి చెందిన సాయిలును శాలువాలతో సన్మానించారు. అనంతరం పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్‌బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, నాయకులు వెంకటయ్య, జగన్మోహన్, దస్తప్ప, వెంకటయ్య, సాయిలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వారిని సన్మానిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

ఎంపీ కొండాను కలిసిన నాయకులు

చేవెళ్ల: పట్టణ బీజేపీ నాయకులు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీతో పార్టీ సభ్యత్వ నమోదు విషయాలపై వారు చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో యువ నాయకుడు డాక్టర్ ఎం.వైభవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మానిక్యరెడ్డి, నాయకులు శ్రీశైలంయాదవ్, కె.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ తదితరులు ఉన్నారు.



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

శంకర్‌పల్లి: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో దుర్గామాత విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. దీనిని పలు హిందూ సంఘాలు తీవ్రంగా ఖండించి, ఆలయం వద్దకు చేరుకుంటున్నారు. దీంతో శంకర్‌పల్లిలో సోమవారం బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల అదుపులో బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షుడు సురేశ్, మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

● బైక్ జారిందా.. అంతే!



రోడ్డుపైనే పేరుకుపోయిన మట్టి

తుర్కయంజాల్: నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సాగర్ రహదారిపై ఇసుక, మట్టి పేరుకుపోయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా మూడు లైన్‌ల రహదారి కాస్తా.. రెండు లైన్‌ల రోడ్డుగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రోడ్డుపైకి నీటితో పాటు ఇసుక, మట్టి కొట్టుకువచ్చి పేరుకుపోయాయి. వర్షాలు తగ్గుముఖం పట్టి పక్షం రోజులు గడుస్తున్నా అధికారులు శుభ్రం చేయించడం లేదు. దీంతో రోడ్డుపై ప్రయాణించే ద్విచక్ర వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు జారీ పడుతున్నారు. దీనికి తోడు దుమ్ము, ధూళి ముంచెత్తుతుంది. ఇప్పటికైనా అధికారుల స్పందించి వెంటనే రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌ను వివరణ కోరగా రోడ్డును వెంటనే శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కుల్కచర్ల: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నిరంతరం తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా వేసే గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం మంగళవారం ప్రారంభమవుతుందని మండల పశువైద్యాధికారి అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14 వరకు నెలరోజుల పాటు గ్రామాల వారీగా గాలికుంటు నివారణ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతీ రోజు ఆరు టీమ్‌ల ద్వారా గ్రామాల్లో పర్యటించి పాడి పశువులకు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ఆగుతూ.. సాగుతూ..

అర్ధంతరంగా నిలిచిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్న వైనం
- రైల్వే గేటుతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పిల్లర్లు దశలోనే బ్రిడ్జి నిర్మాణం

షాద్‌నగర్: రైళ్ల రాకపోకలతో ప్రయాణికులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. మాటిమాటికి గేటు వేస్తుండటంతో వాహనాలు తరచూ గేటు వద్ద ఆగిపోతున్నాయి. ఫలితంగా వాహనదారులు ఇబ్బంది పడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమయ్యాయి. కానీ ఆ పనులు పలు కారణాలతో అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

రైల్వే గేటుతో తప్పని తిప్పలు

షాద్‌నగర్ మీదుగా ప్రతీ రోజు సుమారు ఇరవై రైళ్ల రాకపోకలు కొనసాగిస్తుంటాయి. పట్టణంలోని చటాన్‌పల్లి, కేశంపేట రోడ్డులో రైల్వే గేట్లు ఉన్నాయి. చటాన్‌పల్లి రైల్వేగేటు మీదుగా చటాన్‌పల్లి, బీవీరావునగర్, బుచ్చిగూడ, కొండన్నగూడ, వెల్జర్ల, సంగెం, కొత్తపేటకు చెందిన వేలాదిమంది నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా వాహనదారులు జాతీయ రహదారి బైపాస్ నుంచి షాద్‌నగర్ పట్టణంలోని నుంచి వికారాబాద్, పరిగి వెళ్లాలన్నా చటాన్‌పల్లి రైల్వే గేటును దాటి రావాల్సి ఉంటుంది. దీంతో అనునిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలతో ఈ రహదారి ఎంతో రద్దీగా ఉంటుంది. తరచూ గేటు వేస్తుండటంతో వందల సంఖ్యలో వాహనాలు రైల్వేగేటు వద్ద ఆగిపోతున్నాయి. దీంతో అత్యవసర పరిస్థితులలో గేట్లను దాటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గేటు తీసిన తర్వాత కూడా వాహనాలు అన్నీ ఒకేసారి ముందుకు కదులుతుండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటుంది. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పలుమార్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి నిధులు మంజూరు చేయించారు.



గేటు వేయడంతో నిలిచిన వాహనాలు

ఇదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా

చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే మొత్తం వ్యయం రూ.95కోట్లు కాగా ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.61.31కోట్లు మంజూరు చేసి పరిపాలన అనుమతులు జారీ చేయడంలో పనులు ప్రారంభమయ్యాయి.

నిలిచిన పనులు

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా పిల్లర్లను నిర్మించారు. గత ప్రభుత్వ హయంలో డిజైన్ చేసిన విధానంలో కాకుండా వై జంక్షన్ బ్రిడ్జి నిర్మించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చర్యలు చేపట్టారు. గతంలో డిజైన్ చేసిన విధంగా బ్రిడ్జిని నిర్మిస్తే వాహనదారులకు ఇబ్బందులు తప్పవనే ఉద్దేశంతో వైజంక్షన్ బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గత కొన్నినెలలుగా నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కొందుర్గు పర్యటనకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అదనంగా రూ.89కోట్లు మంజూరు చేయాలని కోరారు.

పనులు ప్రారంభించాలి



బ్రిడ్జి నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. అధికారులు వెంటనే పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలి. షాద్‌నగర్ పట్టణానికి బైపాస్ నుంచి అన్నారం వై జంక్షన్ మీదుగా రావాల్సి వస్తోంది.

– శ్రీకాంత్, షాద్‌నగర్

తరచూ గేటు పడుతుండటంతో..



చటాన్‌పల్లి గ్రామానికి, బైపాస్‌రోడ్డుకు వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ గేటు వేస్తుండటంతో గంటల తరబడి గేటు వద్ద నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలి

– శివకుమార్, షాద్‌నగర్